సాక్షి
కాకినాడ
బుధవారం । 27 । నవంబర్ । 2024



పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడుకోవాలి

అంతర్వేది పుణ్యక్షేత్ర పవిత్రతను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని శృంగేరి పీఠాధిపతి విధు శేఖర భారతీ మహాస్వామి భక్తులకు హితవు పలికారు.




ధాన్యం ఇలా భద్రపరుచుకోవాలి

ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో ధాన్యాన్ని ఎలా భద్రపరచుకోవాలో రైతులకు కాకినాడ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సూచనలు చేశారు.

8లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు, మధ్య డెల్టాలకు చెరో 600, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను విడుదల చేశారు. సముద్రంలోకి 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

అంబేడ్కర్‌కు ఘన నివాళి



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్, జిల్లా అధికారులు

కాకినాడ సిటీ: భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ షణ్మోహన్ పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం అమలులోకి వచ్చి నేటికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జె.వెంకటరావు, జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, సీపీఓ పి.త్రినాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానం ఈఓగా త్రినాథరావు నేడు బాధ్యతల స్వీకరణ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి(ఈఓ)గా వి.త్రినాథరావు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. సింహాచలం దేవస్థానం ఈఓగా ఉన్న ఆయనను ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలతో అన్నవరం దేవస్థానంలో నియమించింది. ప్రస్తుతం ఈఓ, దేవదాయ, ధర్మాదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్ నుంచి త్రినాథరావు ఉదయం 9.30 గంటలకు బాధ్యతలు స్వీకరిస్తారు. సుమారు ఏడాది పాటు అన్నవరం దేవస్థానం ఈఓగా పని చేసిన రామచంద్ర మోహన్‌ను దేవస్థానం సిబ్బంది ఘనంగా సన్మానించనున్నారు. ఉదయం 10 గంటలకు సత్యదేవుని నిత్య కల్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, నూతన ఈఓ త్రినాథరావు పాల్గొంటారు. దేవస్థానంలోని అన్ని విభాగాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొనాలని దేవస్థానం సిబ్బంది సంక్షేమ సంఘం కోరింది.

ఇంటర్ ఉత్తీర్ణత మెరుగు పడాలి

కాకినాడ సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మరింత ఎక్కువ ఉత్తీర్ణత సాధించేలా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. త్రైమాసిక పరీక్షల ఉత్తీర్ణత శాతం, అపార్ నమోదుపై జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్వార్టర్లీ పరీక్షల్లోని మార్కుల ఆధారంగా పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయని, వీటిల్లో చదువుతున్న విద్యార్థుల బోధనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై మరింతగా దృష్టి సారించాలన్నారు. అపార్ నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కొన్నిచోట్ల పుట్టిన తేదీ, పేరు తదితర వివరాలు తప్పుగా నమోదయ్యాయని, వాటిని సరిచేసి ఆధార్‌ను అనుసంధానం చేయాలని సూచించారు. సమావేశంలో డీఐఈఓ జీజీకే నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని రమణయ్యపేట వైద్య నగర్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అందరికీ సమాన హక్కులు, సమాన బాధ్యతలు, కుల వివక్ష లేని సమాజాన్ని రాజ్యాంగం ప్రసాదించిందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కురసాల సత్యనారాయణ, రావూరి వెంకటేశ్వరరావు, సీహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ కలెక్టరేట్ ఎదుట ఇటీవల ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

రణకేతనం

- ఎన్నికల్లో అలవి కాని హామీలు
- గద్దెనెక్కాక విస్మరణ
- కూటమి ప్రభుత్వంపై వివిధ వర్గాల ఆగ్రహం
- కలెక్టరేట్, ఇతర ప్రాంతాల్లో నిత్యం ఆందోళనలు
- హామీలు నెరవేర్చాలని చిరుద్యోగుల డిమాండ్
- పట్టించుకోని సర్కార్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికార పగ్గాలు చేపట్టేందుకు అలవి కాని హామీలు ఇచ్చారు. సూపర్-6తో పాటు అనేక వాగ్దానాలు చేసి, ఓటర్లకు గాలం వేశారు. ఎట్టకేలకు గద్దెనెక్కారు. అంతే.. ఆర్థిక పరిస్థితి బాగోలేదని, కొండంత అప్పులున్నాయని సాకులు చెబుతూ.. హామీలు నెరవేర్చడం సాధ్యం కాదని నాలుక మడత పెడుతున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడమనేది చంద్రబాబు అండ్ కో కు వెన్నతో పెట్టిన విద్య అనే విమర్శ ఉంది. అదే నిజమనే రీతిలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా కూటమి ప్రభుత్వం హామీల అమలు ఊసే తేవడం లేదు. దీంతో, ఎన్నికల ఏరు దాటేందుకే కూటమి నేతలు నాడు రకరకాల మాటలు చెప్పి, తమను మభ్యపెట్టారని అన్ని వర్గాల ప్రజలూ నమ్ముతున్నారు. హామీల అమలుకు కొంత సమయం ఇద్దామనే ధోరణిలో ఇన్నాళ్లూ వేచి చూసిన జనం ఇప్పుడిప్పుడే తిరగబడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేశారంటూ దాదాపు అన్ని వర్గాల ప్రజలూ తిరుగుబాటు జెండా ఎగురవేస్తున్నారు. మాట తప్పి, దగా చేసిన కూటమి ప్రభుత్వంపై దండయాత్ర చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే డిమాండ్లతో ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, వలంటీర్లు, 108, 104 ఉద్యోగులు, సహకార ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు తెలుపుతున్నారు. ప్రతి సోమవారం కాకినాడ కలెక్టరేట్ ప్రాంగణం ఆందోళనకారులతో కిక్కిరిసిపోతోంది. ఇక్కడ రెండు నెలలుగా నిత్యం ఏదో ఒక ఆందోళన జరుగుతూనే ఉందంటే ఆయా వర్గాల్లో అసంతృప్తి ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



అందరికీ ఇసుక అందుబాటులోకి తేవాలంటూ కలెక్టరేట్ వద్ద ఈ నెల 11న భవన నిర్మాణ కార్మికుల ధర్నా



చిన్నారులతో పాటు విద్యార్థులకు పట్టెడన్నం పెట్టే మధ్యాహ్న భోజన పథకం (మిడ్డే మీల్స్) కార్మికులు కూడా వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద నిరసన గళం వినిపించారు.



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెరిగిపోయిన పని ఒత్తిడిని తగ్గించాలని, ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ డ్వాక్రా యానిమేటర్లు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు.

నిర్మాణ కార్మికుల కళ్లల్లో 'ఇసుక'

నిర్మాణ రంగంలో ప్రధానమైన ముడి సరుకు ఇసుక. కూటమి ప్రభుత్వ హయాంలో అది అందుబాటులో లేకపోవడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. ఫలితంగా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తీసుకుని వచ్చింది. ఈ నూతన విధానం అధికార పార్టీ నేతలకు, దళారులకే ఉపయోగపడుతోందని, అవసరమైన వారికి ఇసుక ఉచితంగా దొరకడం లేదని, దీనివలన సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అందరికీ ఇసుక లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు కలెక్టరేట్ వద్ద ఈ నెల 11న ఆందోళన నిర్వహించారు. జిల్లాలోని మూడు ఇసుక స్టాక్ పాయింట్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టెండర్ల ప్రక్రియ కూడా ముగిసింది. కానీ తగినంతగా ఇసుక లభ్యత లేక పోవడంతో జిల్లాలోని నిర్మాణ రంగం కుదేలైంది. దీంతో ఈ రంగంపై ఆధారపడిన భవన నిర్మాణ కార్మికులు కలెక్టర్‌కు మొర పెట్టుకున్నా ఫలితం లేదంటూ ఆందోళనకు దిగారు. సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

'ఆశ'లపై నీళ్లు

ఎన్నికల ముందు తమ ఆందోళనా శిబిరాల వద్దకు కూటమి నాయకులు వచ్చి అనేక హామీలు ఇచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు ఒక్కటి కూడా అమలు చేయకుండా తమ ఆశలపై నీళ్లు జల్లారంటూ ఆశా కార్యకర్తలు ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు. అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు నోరు మెదపడం లేదని ఆగ్రహిస్తూ వారు కలెక్టరేట్ వద్ద ఇటీవల భారీ ఆందోళన నిర్వహించారు. తమ కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలనే డిమాండ్ ఏమైందని నిలదీస్తున్నారు. అధికారంలోకి రాగానే పెంచుతామని చెప్పి, ఇప్పుడు నిలువునా దగా చేస్తారా అని మండిపడుతున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.60 వేలకు సంబంధించిన జీఓ విడుదలపై కూడా వారు ప్రశ్నిస్తున్నారు.



ప్రమాదాల్లో చిక్కుకున్న క్షతగాత్రులకు, బాధితులకు 24/7 వైద్య సేవలు అందించే 108 సేవల ఉద్యోగులతో పాటు.. గ్రామీణులకు వైద్య సేవలు అందిస్తున్న 104 ఉద్యోగులు సైతం తమ సమస్యలు పరిష్కరించాలంటూ రోడ్డెక్కాల్సిన దుస్థితి దాపురించింది. తమను వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించి, 108 సేవలను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సంబంధిత ఉద్యోగులు ఆందోళనకు దిగారు. జీఓ-49ని పునరుద్ధరించి, పైలట్ గ్రాట్యుటీ, ఆర్జిత సెలవుల మొత్తం, వార్షిక ఇంక్రిమెంట్ చెల్లించాలని గళమెత్తారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న 'కూటమి'



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేసి, జీఓ నంబర్ 77 రద్దు చేయాలి. సంక్షేమ హాస్టళ్లకు, కళాశాలలకు నూతన భవనాలు నిర్మించాలి. పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మెటిక్ చార్జీలు పెంచాలి.

– ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ

ప్రభుత్వోద్యోగులుగా గుర్తించండి



అంగన్‌వాడీలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలి. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. వీటిని వెంటనే నెరవేర్చాలి. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలి.

– కరణం ప్రసాదరావు, కార్యదర్శి, సీపీఎం, సామర్లకోట

108ను ప్రభుత్వమే నిర్వహించాలి



108 సేవల సిబ్బందిని వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించి, నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి. జీఓ నంబర్ 49ని పునరుద్ధరించాలి. పైలట్ గ్రాట్యుటీ, ఆర్జిత సెలవుల మొత్తం, వార్షిక ఇంక్రిమెంట్ చెల్లించాలి. జీతంపై 40 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి. ఎరియర్లను వేతనంతో జమ చేయాలి. ప్రతి నెలా జీతం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. 108 ఉద్యోగులకు 8 గంటల పని విధానం అమలు చేయాలి. 108 ఉద్యోగుల సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించాలి.

– చెక్కల రాజ్‌కుమార్, 108 ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు, కాకినాడ

హామీలు గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలనూ నిలువునా దగా చేస్తోంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు మరచిపోయేలా డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతోంది. వలంటీర్ల వేతనాలను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక అసలు ఆ వ్యవస్థే లేదని బాధ్యత కలిగిన మంత్రి అసెంబ్లీలో ఎలా చెబుతారు? ఆశా వర్కర్ల వేతనాల పెంపు మాట మరచిపోయారా? చివరకు ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉండి, ఆపదలో ఉన్న వారిని ఆదుకునే 108, 104 వాహనాల డ్రైవర్లు, సిబ్బందిని వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌ను సైతం నెరవేర్చకుండా సర్కార్ గాలికొదిలేసింది.

– తాటిపాక మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి, కాకినాడ

సేవా సైన్యం.. పోరాట మార్గం



గత ప్రభుత్వ హయాంలో కరోనా వంటి ప్రాణాంతక మహమ్మారి విరుచుకుని పడినా.. వరదలొచ్చినా.. ఇతర ప్రకృతి విపత్తులొచ్చినా.. ప్రభుత్వానికి సంబంధించిన ఏ పని కావాలన్నా సేవా సైన్యంగా నిలిచిన గ్రామ/వార్డు వలంటీర్లు రాజకీయాలకు అతీతంగా ప్రజల మన్ననలు పొందారు. అటువంటి వారు నేడు కూటమి ప్రభుత్వం తమను నిలువునా దగా చేసిందని మండిపడుతున్నారు. జనానికి తలలో నాలుకలా ఉన్న వలంటీర్ వ్యవస్థపై ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఎన్నోసార్లు విషం చిమ్మారు. తీరా ఎన్నికలు వచ్చేసరికి వారి గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని స్వయంగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబే పదేపదే హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు అసలు వలంటీర్ వ్యవస్థే లేదని అసెంబ్లీ సాక్షిగా మంత్రి ప్రకటించారు. అలా చెప్పడానికి సిగ్గుగా లేదా అని వలంటీర్లు నిలదీస్తున్నారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ గ్రామ/వార్డు వలంటీర్ల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ఇటీవల పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వేతనాలు పెంచి, విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు.

అంగన్‌వాడీల ఆందోళన



పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అనేక సేవలు అందిస్తున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్ పని, హెల్పర్ పని ఒక్కరే చేయాల్సి రావడంతో వీరికి పనిభారం ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ తక్షణం జీఓ ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ నెల 16న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలనే జీఓ ఉన్నా సక్రమంగా అమలు కావడం లేదని ఆవేదన చెందారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్లతో 42 రోజుల పాటు అంగన్‌వాడీ వర్కర్లు గతంలో సమ్మె చేశారు. ఆ సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న భక్తజన ప్రవాహం

- సత్యదేవుని దర్శించిన 60 వేల మంది
- 6 వేల వ్రతాల నిర్వహణ
- రూ.60 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరిపై భక్తజనప్రవాహం కొనసాగుతూనే ఉంది. సోమ, మంగళవారాల్లో సుమారు 2 లక్షల మంది సత్యదేవుని దర్శించిన విషయం తెలిసిందే. ఈ ఒరవడి మంగళవారం కూడా కొనసాగింది. కార్తిక బహుళ ఏకాదశి పర్వదినం కావడంతో సత్యదేవుని సన్నిధికి భక్తులు భారీగా తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం 4 గంటల వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 60 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. స్వామివారి వ్రతాలు 6 వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షల ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ పర్యవేక్షించారు.

గత కార్తికం కంటే మిన్నగా..

సత్యదేవుని సన్నిధిలో గత ఏడాది కార్తిక మాసంలో 1.25 లక్షల వ్రతాలు జరిగాయి. ప్రస్తుత కార్తికంలో మంగళవారం నాటికే ఈ రికార్డును అధిగమించి ఏకంగా 1,28,496 వ్రతాలు నిర్వహించారు. గత ఏడాది కార్తికంతో పోలిస్తే ఈసారి ఇప్పటికే సుమారు 3,500 వ్రతాలు అధికంగా జరిగాయి. కార్తిక మాసంలో మిగిలిన ఐదు రోజుల్లో మరో 20 వేల వ్రతాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



రత్నగిరిపై విశ్రాంతి షెడ్డులో సేద తీరుతున్న భక్తులు

ఘనంగా ఏకాదశి పూజలు

కార్తిక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు స్వర్ణపుష్పాలతో అష్టోత్తర పూజ చేశారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ సహస్రార్చన నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రసాదాలు నివేదించి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు సుధీర్, దత్తాత్రేయశర్మ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాన్ని అణచివేయాలని చూస్తే సహించం

- మాజీ మంత్రి దాడిశెట్టి రాజా
- ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని: అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ కో ఆర్డినేటర్ దాడిశెట్టి రాజా అన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని తుని పట్టణంలోని సోమరాజు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజా.. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి అణచివేయాలని చూస్తే సహించేది లేదని అన్నారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేవిధంగా అధికార పక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అంబేడ్కర్ తెచ్చిన రాజ్యాంగాన్ని విస్మరించి ఆరు నెలలుగా అణచివేత ధోరణి అవలంబిస్తోందని చెప్పారు. సోషల్ మీడియా పేరుతో తమ పార్టీ నాయకులపై అక్రమంగా 17 కేసులు పెట్టారన్నారు. రెండేళ్ల క్రితం సోషల్ మీడియాలో వచ్చిన పోస్ట్‌కు లైక్ కొట్టినందుకు నాన్ బెయిలబుల్ కేసు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని రాజా భరోసా ఇచ్చారు. పదేళ్లుగా సోషల్ మీడియాలో వస్తున్న పోస్టుల్లో తమ పార్టీ వారివి ఒక శాతం ఉంటే, మిగిలిన 99 శాతం టీడీపీ, జనసేన పార్టీ వారే పెడుతున్నారని చెప్పారు. తుని నియోజకవర్గంలో మామా అల్లుళ్ల నిరంకుశ పాలన సాగుతోందని దుయ్యబట్టారు. అల్లుడు గల్లాపెట్టె వద్ద ఉంటే.. టీడీపీ నేత అయిన మామ యనమల రామకృష్ణుడు అమాయకులపై కేసులు పెట్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారని అన్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే గట్టి జవాబు చెబుతారని అన్నారు. ప్రజలకు అండగా ఉండాల్సిన పోలీసు వ్యవస్థ పచ్చ చొక్కాలు వేసుకుని టీడీపీ నాయకుల కొమ్ము కాస్తోందని, ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని రాజా హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, తలుపులమ్మ లోవ దేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, పలువురు దళిత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సపక్ తక్రా పోటీల్లో ఇద్దరికి కాంస్య పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 సపక్ తక్రా క్రీడా పోటీల్లో స్థానిక కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అప్పారి పవన్, పేరూరి రోహిత్ సాయి ఫణీంద్రలు కాంస్య పతకాలు సాధించారు. వీరు ఉమ్మడి తూర్పు గోదావరి తరఫున సపక్ తక్రా క్రీడలో సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ తెలిపారు. పతకాలు, షీల్డ్‌లను ఇద్దరి విద్యార్థులు విజయవాడలో ఆదివారం రాత్రి అందుకున్నారని చెప్పారు. ఈ ఇద్దరిని డీఈవో డాక్టర్ ఎస్కే సలీమ్ బాషా, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, స్థానిక కౌన్సిలర్ తిక్కా సత్య లక్ష్మి, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వానపల్లి ముక్కోటి రాంబాబు అభినందించారు.

గోగన్నమఠం వాసికి ముంబయి జట్టులో చోటు



సత్యనారాయణరాజు

మామిడికుదురు: ముంబయి ఇండియన్స్ జట్టులో స్థానం పొందిన ఫాస్ట్ బౌలర్ పీవీ సత్యనారాయణరాజు గోగన్నమఠం గ్రామానికి చెందినవాడు. అతను ఇక్కడే పుట్టాడు. ప్రాథమిక విద్యాభ్యాసం అంతా ఇక్కడే జరిగింది. ఐపీఎల్ మెగా వేలంలో మేటి జట్టు అయిన ముంబయి ఇండియన్స్ రూ.30 లక్షలకు ఇతన్ని దక్కించుకుంది. ముంబయి ఇండియన్స్ జట్టుకు సత్యనారాయణరాజు ఎంపిక కావడంతో అతని స్వస్థలం గోగన్నమఠంలో మంగళవారం స్నేహితులు, బంధువులు సంబరాలు చేసుకున్నారు. మా వాడికి ముంబయి జట్టులో చోటు దక్కిందంటూ ఆనందం పంచుకున్నారు. సత్యనారాయణరాజు తండ్రి రమేష్ రాజు కొన్నేళ్ల క్రితం కాకినాడ వెళ్లి అక్కడ స్థిర పడ్డారు. ఆయనకు ఇద్దరు కొడుకులు కాగా పెద్ద కొడుకు సత్యనారాయణరాజు ఫాస్ట్ బౌలర్‌గాను, చిన్న కొడుకు పాండురంగారావు బ్యాట్స్‌మెన్‌గాను క్రికెట్‌లో రాణిస్తున్నారు. ఇప్పుడు పెద్ద కొడుకు ఐపీఎల్‌కు ఎంపిక కావడం స్థానికులను ఆనందంలో ముంచెత్తింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మలికిపురం: మండలంలోని శంకరగుప్తం గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేశనపల్లి గ్రామానికి చెందిన కల్వకొలను వెంకటలక్ష్మి(55) అనే మహిళ మృతి చెందినట్టు ఎస్సై పి.వి.వి.ఎస్.సురేష్ తెలిపారు. భర్త ఏసుబాబుతో కలిసి అంతర్వేది పుణ్యస్నానాలకు వెళ్లిన వెంకట లక్ష్మి మోటార్ సైకిల్‌పై తిరిగి కేశనపల్లి వెళ్తుండగా శంకరగుప్తంలో ముందు వెళ్తున్న మోటార్ బైక్ సిగ్నల్ ఇవ్వకుండా హఠాత్తుగా టర్న్ తీసుకోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన వెంకటలక్ష్మిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఆయన వివరించారు.

ధాన్యం ఇలా భద్రపరచుకోవాలి..



తేమ శాతం తగ్గించేందుకు ఆరబెట్టిన ధాన్యం



కాకినాడ సిటీ: ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంటికి వచ్చిన ధాన్యాన్ని ఎలా భద్రపరుచుకోవాలో తెలియక రైతులు తికమకపడుతుంటారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని భద్రపరుచుకోవడం రైతులకు సవాల్ లాంటిది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పండించిన పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం ఉందంటున్నారు వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎన్.విజయకుమార్. ధాన్యం నిల్వ చేసుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరించారు. ధాన్యం నూర్చిన తరువాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికి పైగా భద్రపరచాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం రంగు, రుచి తగ్గుతుంది. సాధారణంగా వరి కోతల సమయంలో ధాన్యం 20 శాతం తేమ ఉంటుంది. కోసిన తరువాత వరి పనలను ఆరబెట్టడం వల్ల 4 నుంచి 6 శాతం తేమ తగ్గవచ్చు. ధాన్యంలో 14 శాతానికి మించి తేమ ఉంటే బూజు పట్టే అవకాశాలు ఉంటాయి. నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగుజేస్తాయి. అంతేకాక ఎలుకలు ధాన్యాన్ని తినడమే కాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది. నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాల బెడద కూడా ఎక్కువే..

ముక్క పురుగు

పంట కోయడానికి ముందు నుంచే ముక్క పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. ప్రౌఢ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.



ఎన్.విజయకుమార్, జిల్లా వ్యవసాయాధికారి, కాకినాడ

వడ్ల చిలుక

ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడు వాసన వస్తుంది. తల్లి కీటకాలు వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడతాయి. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పై పొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటికి వస్తుంది. ఇది వడ్ల మూటలు, గిడ్డంగులలో కనిపిస్తుంది.

నుసి పురుగు

దీనినే పుచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా 3 మిల్లీమీటర్ల పొడవు ఉంటుంది. ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశల్లో చెత్తను, ఆ తరువాత గింజపై పొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది.

ఎలుకల నివారణకు చర్యలు

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా రోజూ శుభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింద భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్‌మెస్ మూతలు అమర్చాలి.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి

రైతుల తక్కువ ధాన్యం నిల్వ చేసుకోవాలంటే వెదురు, సిమెంటు, లోహపు గాదెలను వినియోగించుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాంలు లేదా గిడ్డంగులను సిమెంటు కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షపు నీరు లోనికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వకు కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచులపై, లోపలి మలాథియాన్ లేదా ఎండోసల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. తర్వాత రోజు సంచులను ఎండలో ఆరబెట్టాలి.

అనర్హులకు ఎందుకు ఉద్యోగాలు ఇచ్చినట్టు?

జీజీహెచ్ మేనేజర్‌కు కలెక్టర్ మెమో

కాకినాడ క్రైం: అనర్హులకు ఎందుకు ఉద్యోగాలు ఇచ్చినట్లు..? అర్హుల భవితను ఎందుకు చిదిమేశారు..? నాన్ లోకల్ వారికి ఎందుకు ప్రయోజనం చేకూర్చారు...? పెన్సిల్ రాతలతో ఎందుకు రికార్డులు మార్చేశారు...? రోస్టర్ ఎందుకు అవలంబించలేదు..? ఇవీ... కలెక్టర్ షన్మోహన్ నర్సింగ్ పోస్టుల విక్రయాలకు పాల్పడిన జీజీహెచ్ మేనేజర్ నరసింగరావుపై సంధించిన ప్రశ్నలు. నర్సింగ్ పోస్టుల విక్రయాల బాగోతంపై కలెక్టర్, డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ షన్మోహన్ కాకినాడ జీజీహెచ్ మేనేజర్ నరసింగరావుకు మెమో జారీ చేశారు. అవినీతి జరిగిందనే ప్రాథమిక నిర్ధారణలను ప్రస్తావిస్తూ చోటు చేసుకున్న అవకతవకలను మెమోలో ప్రస్తావించారు. నియామకాల్లో ఇంతటి అవినీతికి పాల్పడితే ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌ను వివరణ కోరగా నరసింగరావుపై నర్సింగ్ పోస్టుల విక్రయాల అంశంపై చేపట్టిన విచారణ ఆధారంగా మెమో జారీ చేసినట్లు తెలిపారు. శాంక్షన్ పోస్టుల్లో అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణలకు సంబంధించి విచారణకు, ప్రస్తుత మెమోకు సంబంధం లేదన్నారు. అతని వివరణ అనంతరం తుది చర్యల కోసం విచారణ అంశాలను రాష్ట్ర స్థాయి సంబంధిత విభాగానికి నివేదిస్తామని తెలిపారు.

వైభవంగా కార్తిక దీపారాధన



కార్తిక దీపారాధన మహోత్సవం ప్రారంభించిన మంత్రి సుభాష్



ఉష్ట్ర వాహనంపై స్వామి నగరోత్సవం ప్రారంభించిన పిల్లి సూర్యప్రకాశ్



అఖండ దీపారాధన ప్రారంభించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



సామూహిక లక్షతులసి పూజలో పాల్గొన్న భక్తులు

రామచంద్రపురం రూరల్: ఏటా కార్తిక మాసం చివరి మంగళవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహించే కార్తిక దీపారాధన మహోత్సవాలు 61వ సంవత్సరం వైభవంగా నిర్వహించారు. ఉదయం జుత్తిక చిన్న బ్రహ్మత్వంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకుని విశేష లక్ష తులసి పూజ ప్రారంభించారు. మధ్యాహ్నం రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవాన్ని ప్రారంభించగా గ్రామంలో స్వామివారి నగరోత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అఖండ జ్యోతి వెలిగించారు. శుభమ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి ఆహూతులను ఉర్రూతలూగించింది. దవులూరి శ్రీను ఆధ్వర్యంలో కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా మందు కాలుపులతో చిన్నారులు కేరింతలు కొట్టారు. అర్ధ రాత్రి ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం నాటకం ఆకట్టుకుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంఖవరం: సీతంపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం వ్యక్తి మృతి చెందాడు. గ్రామంలోని జాతీయ రహదారిని ఆనుకొని ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒడిశాలోని రాయగడ్‌కు చెందిన జన సురేష్ కుమార్ (32) మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆపరేషన్ కోసం వెళ్లి అనంతలోకాలకు..

- హాస్పిటల్‌లో వ్యక్తి మృతి
- వైద్యుల నిర్లక్ష్యం వల్లే అంటున్న మృతుని బంధువులు
- కార్తికేయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఘటన
- కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు
- పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబం



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కొడుకులు, బంధువులు



హాస్పిటల్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు, గ్రామస్తులు



మృతుడు శ్రీను (ఫైల్)

గండేపల్లి: ఆపరేషన్ చేయించుకునేందుకు వెళ్లిన రోగి అనంతలోకాలకు చేరుకున్నాడు. వైద్యం వికటించి మృత్యువాతగురైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతుని బంధువులు, గ్రామస్తుల వివరాల మేరకు.. జగ్గంపేట మండలం సీతారాంపురానికి చెందిన చింతల శ్రీను (46) గురువారం మోటార్ సైకిల్‌పై జగ్గంపేట వైపు వస్తుండగా కొత్తూరు శివారున గల పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి మద్యం సేవించి మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తులు ఢీకొట్టడంతో అతనిని ముక్కుకు గాయమైంది. చికిత్స కోసం గండేపల్లి మండల పరిధిలో గల కార్తీకేయ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌కి బంధువులు తీసుకువచ్చారు. నాలుగు రోజులు అనంతరం చికిత్స నిమిత్తం క్షతగాత్రుడు శ్రీనును మంగళవారం ఆపరేషన్ థియటర్‌కు తీసుకువెళ్లారు. వైద్యుల నిర్లక్ష్యంతో వైద్యం జరుగుతుండగానే శ్రీను మృతి చెందాడని, మృతి చెందిన విషయాన్ని చాలా సేపటి వరకు తమకు చెప్పలేదని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. చికిత్స కోసం కట్టాల్సిన సొమ్మును మృతుని భార్య మెడలో బంగారు వస్తువులు తాకట్టుపెట్టి చెల్లించామని, ఆరోగ్యంగా ఆపరేషన్ గదిలోకి వెళ్లిన వ్యక్తి ఎలా మృతి చెందుతాడని బాధితులు ప్రశ్నిస్తున్నారు. వైద్యం వికటించే మృతి చెందాడని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు చెబుతుండగా వైద్యం ప్రారంభించకుండానే మృతి చెందినట్టు వైద్యులు చెబుతున్నారు. శ్రీను మృతి చెందిన విషయం తెలిసిన క్షణాల్లో బంధువులు, గ్రామస్తులు హాస్పిటల్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. మృతుడు శ్రీనుకు భార్య సీత, కొడుకులు రాంబాబు, సాంబ ఉన్నారు. శ్రీను వ్యవసాయం చేసుకుంటుండగా రాంబాబు ప్రైవేటు రైస్‌మిల్లులోను, సాంబ ఒక ప్రైవేటు స్కూల్ బస్సులో పనిచేస్తున్నట్టు తెలిపారు. ఘటనా స్థలం వద్దకు చేరుకున్న జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, గండేపల్లి ఎస్సై యువి శివనాగబాబు, సిబ్బంది ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. కొత్తూరులో జరిగిన మోటార్ సైకిల్ ప్రమాదంపై మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు జగ్గంపేట పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా గతంలోనూ ఈ హాస్పిటల్లో ఇదే తరహాలో పలు ఘటనలు జరిగాయని, ఈ ఆస్పత్రిపై ఎటువంటి నియంత్రణ లేదని వారు ఆరోపిస్తున్నారు.

పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడుకోవాలి

శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి



ప్రసంగిస్తున్న భారతీ మహాస్వామి. చిత్రంలో ఎమ్మెల్యే, ఆలయ ఏసీ, రాజా బహద్దూర్

సఖినేటిపల్లి: భగవంతుడు కొలువై ఉన్న అంతర్వేది పుణ్య క్షేత్ర పవిత్రతను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని శృంగేరి పీఠాధిపతి విధు శేఖర భారతీ మహాస్వామి భక్తులకు హితవు పలికారు. మంగళవారం అంతర్వేది క్షేత్రంలో లక్ష్మీనృసింహుని దర్శనానికి విచ్చేసిన భారతీ మహాస్వామికి అర్చకులు, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. లక్ష్మీనృసింహస్వామికి విశేష అర్చన, ఉపాలయంలోని రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులను ఉద్దేశించి భారతీ మహాస్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. దివ్య క్షేత్రంలో భగవంతుడికి సేవ చేసుకోవడం ఎంతో పుణ్యప్రదమైందన్నారు. భగవంతుడి పట్ల శ్రద్ధాభక్తి, విశ్వాసం ఉంచాలన్నారు. భగవత్సంకల్పం ఉంటే ఎంత కష్టమైన పనైనా సులభంగా జరుగుతుందన్నారు. లక్ష్మీనృసింహుని దివ్యానుగ్రహంతో పుణ్యక్షేత్రంలో అభివృద్ధి పనులు దిగ్విజయంగా జరగాలని ఆకాంక్షించారు. సనాతన ధర్మం ఎప్పుడూ దృఢంగా ఉండాలి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేదిక వద్ద ఏటా నృసింహ జయంతి రోజున స్వామివారి పూజా కార్యక్రమాలు నిమిత్తం శృంగేరి పీఠం తరఫున శాశ్వత విరాళంగా రూ.లక్షా 11 వేల 116 నగదును దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు మహాస్వామి అందజేశారు. వేదిక వద్ద రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహద్దూర్, మహాస్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు, ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జీ పెదకాపు, ప్రజాప్రతినిధులు బైరా నాగరాజు, కొండా జాన్‌బాబు, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దారు సీహెచ్ భాస్కర్ పాల్గొన్నారు. తొలుత అంతర్వేది బీచ్‌లో భారతీ మహా స్వామి పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం నీలకంఠేశ్వరస్వామివారి ఆలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు. ఆలయంలోని పార్వతీదేవి అమ్మవారిని మహాస్వామి దర్శించుకున్నారు. కాగా స్వామీజీ మంగళవారం సాయంత్రం వానపల్లిలో పర్యటించారు. రాత్రికి రాజమహేంద్రవరం చేరుకున్న ఆయనకు భక్తులు ఘన స్వాగతం పలికారు. శోభాయాత్ర నిర్వహించారు.